క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, తీగలకు అడ్డుగా చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని గాజులరామారం సబ్ స్టేషన్ ఏఈ చైతన్యభార్గవ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ ఆర్ఎమ్‌నగర్ ఫీడర్ పరిధిలోని చంద్రగిరినగర్, ఎన్టీఆర్ నగర్, అంబేడ్కర్‌నగర్, భవానీనగర్, పీపీ నగర్, ఉమాదేవినగర్, ఉషోదయ కాలనీ ఫేజ్-02, చిత్తారమ్మదేవినగర్, జయశంకర్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు.. అదే విధంగా 11కేవీ శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్, బేకరీ గడ్డ, అంబేడ్కర్‌నగర్, భవానీనగర్, సుభాష్ చంద్రబోస్ నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నిజాంపేట్: ఎమ్మెల్యే వివేకానంద్, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డిలు గురువారం కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ కౌసల్యకాలనీ, మహావిల్లాస్‌లలో పర్యటించనున్నారు. అనంతరం బాచుపల్లి చౌరస్తాలో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించనున్నారు. డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ రామకృష్ణరావు సైతం పాల్గొననున్నారు.

విద్యార్థి గర్జనను జయప్రదం చేయాలి

నిజాంపేట్: ఇందిరాపార్క్ వేదికగా ఈ నెల 10వ తేదీన నిర్వహించే విద్యార్థి గర్జనను జయప్రదం చేయాలని దళిత బహుజన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిప్పలపల్లి విక్రమ్, బహుజన విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సందీప్‌లు ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలన్నారు. మన ఊరు – మన బడి పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్, టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలనే డిమాండ్లతో చేపడుతున్న విద్యార్థి గర్జనకు వేలాదిగా తరలి రావాలని కోరారు.

కరాటేలో రాణిస్తున్న బూమ్స్ అకాడమీ విద్యార్థులు



కరాటేలో శిక్షణ ఇస్తున్న కోచ్ కృష్ణ

కుత్బుల్లాపూర్: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ ఆధారంగా వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా, రాష్ట్ర, నేషనల్ లెవెల్‌లో రాణించే విధంగా తీర్చిదిద్దుతున్నామని బూమ్స్ అకాడమీ కోచ్ కృష్ణ అన్నారు. ప్రగతినగర్, గాజులరామారం ప్రాంతంలో నామమాత్రపు ఫీజుతో స్కేటింగ్, కరాటే వంటి శిక్షణ ఇస్తూ సుమారు రెండు బ్రాంచ్‌లలో 140 మందికి వివిధ రకాల శిక్షణ ఇస్తూ వారిని నేషనల్ లెవెల్‌లో పోటీపడేలా తయారు చేస్తున్నారు. ఇప్పటికే బూమ్స్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థులు వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని తమదైన శైలిలో తెలంగాణ ప్రాంతం నుంచి బంగారు పతకాలు సాధించిన వారు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నిర్ణయం మేరకు వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ఇతర రాష్ట్రాల్లో జరిగే పోటీలకు తీసుకువెళ్తున్నామని కోచ్ కృష్ణ సాక్షితో అన్నారు. త్వరలోనే మరికొన్ని ప్రాంతాల్లో ఈ శిక్షణ కేంద్రాలను విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రాణ రక్షణ కోసం కరాటే పోటీలు ఎంతో దోహదపడతాయని ముఖ్యంగా మహిళలు తమకు తాము రక్షించుకునే దిశగా కరాటే స్కేటింగ్‌లలో శిక్షణ తీసుకుంటే ఆత్మరక్షణ ఉంటుందని తెలిపారు.

కా

గృహలక్ష్మిపై.. సందేహాలెన్నో..?

- గడువు పెంచాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు
- గ్రామకంఠం, దస్తావేజులు, నోటరీలపై అనుమానాలు
- జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 2,567 మాత్రమే..
- గ్రేటర్ హైదరాబాద్‌తో సహా రంగారెడ్డి జిల్లాలోనూ ఇదే పరిస్థితి

నేటితో గృహలక్ష్మి దరఖాస్తుల గడువు ఆఖరు



సాక్షి, మేడ్చల్ జిల్లా: పేద, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నెరవేర్చేలా ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న వారికి నివాసం కల్పించేందుకు జీవో ఎంఎస్ 25 కింద మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటికే రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి పంపిణీ చేయగా, ఇక సొంత జాగా కలిగి ఉండి ఇళ్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించి.. ఈ నెల 10వ తేదీ వరకు తుదిగడువు విధించడంతో అందరిలో అయోమయం నెలకొంది. దరఖాస్తుకు ఏ పత్రాలు జతచేయాలో.. ఎవరి పేరిట దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామకంఠం స్థలాలు ఉన్న వారికి దస్తావేజులు లేకపోవడం, అసైన్డ్ భూములు, నోటరీలు ఉన్న పేదలు కూడా దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నో అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి గ్రేటర్ హైదరాబాద్‌తోసహా రంగారెడ్డి జిల్లాలో నెలకొంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు 2,567 మంది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో కూడా దరఖాస్తులు సమర్పించిన తీరు ఇంచుమించు అలాగే ఉంది. సొంత స్థలం ఉండి.. పక్కా ఇల్లు లేని బలహీనవర్గాల కుటుంబాలు మాత్రమే గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోంది.

నేటితో ఆఖరు కావటంతో..

దరఖాస్తుల సమర్పణకు కేవలం గురువారం మాత్రమే గడువు ఉండటంతో అందరిలో అనుమానాలను రేకెత్తిస్తోంది. కుల, వార్షికాదాయ వివరాలను అడగడం.. ఇళ్ల కేటాయింపుల్లో కులాల వారీగా రిజర్వేషన్లు ఉండటంతో.. ఆ పత్రాలు లేని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. గడువులోగా ఆ పత్రాలు వస్తాయో, రావో అన్న మీమాంస కూడా వారిని వెంటాడుతుండటంతో .. గడువు పెంచాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

సాయం ఎలా పొందాలంటే..

ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలను ఒకేసారి ఇవ్వదు. వీటిని మూడు విడతలుగా మంజూరు చేస్తారు. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు మొదట పునాది నిర్మించిన సమయంలో రూ.లక్ష, రూఫ్ లెవల్లో మరో రూ.లక్ష, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో రూ.లక్ష విడుదల చేయనుంది. లబ్ధిదారుడు తనకు నచ్చిన విధంగా ఇల్లు నిర్మించుకోవచ్చు. రెండు గదులతోపాటు మరుగుదొడ్డి తప్పక నిర్మించుకోవాలి. ఇల్లు ఉండి జీవో 59 కింద లబ్ధిపొందిన వారికి గృహలక్ష్మి పథకం వర్తించదు. స్థానికంగా ఆహార భద్రత కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండి మహిళ పేరుతో దరఖాస్తు చేసిన వారికి మాత్రమే ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తోంది. మంజూరైన డబ్బులను కూడా 100 శాతం రాయితీలో ఇవ్వనుంది.

దరఖాస్తుతో జత చేయాల్సినవి ఇవే..

నిర్ణీత దరఖాస్తుతో రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆహార భద్రత కార్డు, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి స్థలం దస్తావేజులు, ఇంటి పన్ను రసీదు, విద్యుత్తు బిల్లు రసీదు, బ్యాంకు పాసుబుక్ జిరాక్సు ప్రతులను జత చేయాల్సి ఉంటుంది. దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

కౌంటర్లు ఇక్కడే..

జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశాలతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కలెక్టరేట్‌తోసహా 15 తహసీల్దార్ కార్యాలయాలు, 13 పురపాలక సంఘాల కార్యాలయాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి గృహలక్ష్మి దరఖాస్తులు తీసుకునేలా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పోర్టల్..

గృహలక్ష్మి పథకంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా అమలు పరిచేందుకు 'గృహలక్ష్మి' పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను ప్రభుత్వం రూపొందించింది. దరఖాస్తుల ఎంపిక ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, కలెక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. దశలవారీగా ఎంపికైన లబ్ధిదారులకు జిల్లా మంత్రి ఇళ్లను మంజూరు చేయనున్నారు.

కుత్బుల్లాపూర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం



ఎమ్మెల్యే వివేకానంద్‌కు స్వాగతం పలుతుకున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతి యాత్రలో భాగంగా బుధవారం ఆయన జగద్గిరిగుట్ట డివిజన్ శివనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా శివనగర్‌లో రూ.17లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీహాల్, రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు చేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు.

- తొమ్మిదేళ్లుగా నియోజకవర్గంలో కోట్లాది నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో నిధులకు ఢోకా లేకుండా పనులను పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రూపదేవి, జలమండలి డీజీఎం విష్ణు ప్రసాద్, బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సోమేశ్ యాదవ్, డివిజన్ల అధ్యక్షులు రుద్రా అశోక్, పుప్పాల భాస్కర్, నాయకులు సయ్యద్ రషీద్, కృష్ణగౌడ్, వేణు యాదవ్, బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ ఆయూష్ పార్క్‌లో సౌకర్యాలు కల్పించాలి



జీడిమెట్ల: గాజులరామారంలోని ఆక్సిజన్ ఆయూష్ పార్క్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని వాకర్స్ కోరుతున్నారు. ఆయూష్ పార్కులో ప్రతినిత్యం 500 నుంచి 600ల మంది వాకింగ్‌కు వస్తారన్నారు. వాకింగ్ ట్రాక్, సోలార్ విద్యుత్‌దీపాలు, స్త్రీలకు మూత్రశాలలు, ఓపెన్ జిమ్ లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర అటవీశాఖ అధికారులు పట్టించుకుని వెంటనే ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో తయారైన పార్కుల్లో ఇంకా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే చాలా మంది ప్రజలు పార్కుకు వస్తారని వాకర్స్ కన్వీనర్ దామోదర్ యాదవ్, చీఫ్ అడ్వైజర్ కస్తూరి బాలరాజులు తెలిపారు. అధికారులు పట్టించుకుని సౌకర్యాలు కల్పించకపోతే త్వరలోనే రాతపూర్వకంగా వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.

గృహలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: గృహలక్ష్మి పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఇంటి స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోలేని పేదలకు ఈ పథకం వరం లాంటిదన్నారు. తొలుత నియోజకవర్గంలో 3వేల మందికి ఈ పథకాన్ని వర్తింపజేస్తోందన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. అర్హులందరూ దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని కోరారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోనే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అదే విధంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆయనను కలిసి పలు సమస్యలను విన్నవించారు.

రూ.3లక్షల సాయం ఏమాత్రం సరిపోదు

నిజాంపేట్: పేదలు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సీఎం కేసీఆర్... నేడు గృహలక్ష్మి పథకం పేరులో రూ.3 లక్షలు ప్రకటించడం సరైంది కాదని మేడ్చల్ జిల్లా కేవీపీఎస్ కార్యదర్శి బాలపీరు అన్నారు. గ్రామాల్లో ఇంటి నిర్మాణానికి రూ.15 లక్షలు, అదే పట్టణాల్లో అయితే రూ.25 లక్షల వరకు ఖర్చవుతోందన్నారు. రూ.3 లక్షల ఆర్థిక సహాయం ఏమాత్రం సరిపోదన్నారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 10వ తేదీ వరకే గడువు విధించారని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు పొందడానికే వారం రోజులు సమయం పడుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి గడువును పెంచాలని కోరారు.



వేటగాళ్లు బంధించారు.. వాకర్స్ విడిపించారు!

సుభాష్‌నగర్: వేటగాళ్లు పావురాలను బంధించగా.. అటుగా వెళ్తున్న వాకర్స్ వారి నుంచి పావురాలను కాపాడారు. ఈ ఘటన దూలపల్లి చోటుచేసుకుంది. బుధవారం ఉదయం 6గంటల సమయంలో దూలపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద వేటగాళ్లు పావురాలకు దాణాను ఎరగా వేసి వాటిని బంధించారు. అదే సమయంలో వాకింగ్‌కు వెళ్తున్న వెంకటేష్, గౌరిష, సుదర్శన్, శ్రీకాంత్ వేటగాళ్లను మందలించి పావురాలను వదిలిపెట్టారు.

మాతృభూమికి సేవ చేయడం గొప్ప వరం



కళాశాల ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కార్గిల్ యుద్ధవీరులు

దుండిగల్: మాతృభూమికి సేవ చేయడం గొప్ప వరమని... దేశం కోసం ప్రాణ త్యాగాలను సైతం లెక్క చేయకుండా పని చేశామని కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఎం.అశోక్‌కుమార్, భారత వైమానిక దళానికి చెందిన పంకజ్ కుమార్ శ్రీవాస్తవ్ అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 'మన్‌కీ బాత్'లో ప్రస్తావించిన 'మేరి మాటి మేరా దేశ్ (నా దేశం.. నా మట్టి) 'కార్యక్రమంలో భాగంగా దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో 75 మొక్కలను నాటారు. అనంతరం సైన్యం, వైమానిక దళంలో వారు చేసిన సేవలు, అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ రావు, డీన్ రాధికాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి ఉదయ్ రంజన్‌గౌడ్, హెచ్ఓడీలు సత్యనారాయణ గుప్తా, బలరాం, చిరంజీవి, సాయిప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ రాజు



తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వరస్వామిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బుధవారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న శంభీపూర్ రాజును ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి ప్రసాదం అందజేశారు. సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నాయకులు గోవింద్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రమణ ఉన్నారు. – కుత్బుల్లాపూర్

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, తహసీల్దార్

దుండిగల్: 18 సంవత్సరాలు నిండిన వారికి నూతన ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు, గండిమైసమ్మ దుండిగల్ మండల తహసీల్దార్ సుచరిత అన్నారు. దుండిగల్ మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో బుధవారం బీఎల్ఓలకు అవగాహన కల్పించారు.

- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు నూతన ఓటర్ల నమోదు ప్రక్రియపై ఎన్నికల

బీఎల్ఓలకు పలు సూచనలు

కమిషన్ అనుమతించిందన్నారు. అప్పటిలోగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు, మౌలిక సౌకర్యాలు, ఓటర్ల నమోదును ప్రోత్సహించాలన్నారు.

- 7, 8, 8ఏ ఫారాలను పరిశీలించాలన్నారు. నూతన ఓటరు, అదనంగా ఉన్న ఓటర్ల తొలగింపు, ప్రాంతాల మార్పులను గమనించి నియోజకవర్గ ఎన్నికల అధికారులకు నివేదించాలని సూచించారు.
- అదే విధంగా వారం రోజుల పాటు మున్సిపాలిటీ పరిధిలో 23 సంవత్సరాలలోపు ఉన్న అనాథలను గుర్తించి ప్రభుత్వానికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, రెవెన్యూ అధికారి సునంద, ఎన్నికల సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గృహలక్ష్మి క్యూ



తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలు

ఒక్కరోజే 534 దరఖాస్తులు

సుభాష్‌నగర్: సొంత స్థలం ఉండి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు జనాలు క్యూ కట్టారు. గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయనికి మండల పరిధిలోని పాలు బస్తీల చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు దరఖాస్తు పెట్టుకున్నారు.

- ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునేవారు దరఖాస్తు ఫారంతో పాటు రేషన్, ఆధార్‌కార్డ్, కులం సర్టిఫికెట్, స్వీయ ధ్రువీకరణ పత్రం, స్థలం డాక్యుమెంట్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను జతపరచాలని కోరారు. ఒక్క రోజే 534 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్లపై నిర్మాణాలు.. రాకపోకలకు అడ్డంకులు



బాలయ్యనగర్‌లో రోడ్డుపైన కట్టిన నిర్మాణాలను కొలుస్తున్న స్థానికులు

సుభాష్‌నగర్: నిబంధనలకు వ్యతిరేకంగా రోడ్లపై నిర్మాణాలు చేపడుతూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేష్ డిమాండ్ చేశారు. మహాదేవపురం చౌరస్తా నుంచి బాలయ్యనగర్‌కు వచ్చే ప్రధాన 30 ఫీట్ల రోడ్డు కబ్జా చేసి పలు నిర్మాణాలు చేపడుతుండటంతో బుధవారం బస్తీ వాసులు స్వయంగా రోడ్లు కొలిచారు. కొంతమంది ఏకంగా రోడ్డుపైకి నాలుగు ఫీట్లు మెర జరిగి నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించారు.

- ఈ సందర్భంగా బస్తీ ప్రెసిడెంట్ నాగేష్ మాట్లాడుతూ.. కొంతమంది ధనార్జనే ధ్యేయంగా రెంట్లకు కక్కుర్తి పడి తక్కువ స్థలంలో ఎక్కువ అంతస్తులు నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. రోడ్డులోకి నాలుగు ఫీట్లు మీద జరిగి నిర్మాణాలు, కమాన్, ర్యాంప్, ట్రాన్స్‌ఫారమ్, మెట్లు చేపట్టడంతో విశాలంగా ఉన్న రోడ్డు ఇరుకుగ మారిందన్నారు. తద్వారా బస్తీలోకి భారీ వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు వెళ్లేందుకు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై అధికారులకు బస్తీ వాసులతో కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

సుభాష్‌నగర్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవేందర్‌నగర్ బతుకమ్మబండకు చెందిన షేక్ హబీబ్, షేక్ ఇర్ఫానా(25)లు భార్యాభర్తలు. కాగా బుధవారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఇద్దరి మధ్య గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఇర్ఫానా భర్తను గదిలో పెట్టి గడియవేసింది. ఆపై చీరతో సీలింగ్ రాడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలి

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. దేశవ్యాప్తంగా ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న మహాపడావ్ వాల్‌పోస్టర్‌ను బుధవారం కార్మికులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి తెచ్చుకున్న లేబర్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చి అన్యాయం చేస్తోందన్నారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా జరిగే ఈ నిరసన కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆశి యాదయ్య, బాగ్యమ్మ , నర్సమ్మ, అమృతమ్మ, లక్ష్మి, యాదమ్మ, సత్తమ్మ, పుష్పమ్మ, ముత్తమ్మ, నాగమణి, లలిత, కృష్ణ, యకయ్య, శ్రీను, జితేందర్, యాదగిరి, లిమేడర్ తదితరులు పాల్గొన్నారు.



మహాపడావ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చెరువులను అభివృద్ధి చేయాలి



కలెక్టరేట్‌లో వినతి ప్రతం అందజేస్తున్న జెమ్మి దేవేందర్

కుత్బుల్లాపూర్: చెరువులను మిషన్ కాకతీయ పథకం నిధులతో అభివృద్ధి చేయాలని మాజీ సింగిల్ విండో డైరెక్టర్, బీఆర్ఎస్ నేత జెమ్మి దేవేందర్ అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కొంపల్లి మున్సిపల్ పరిధిలోని చెరువుల అభివృద్ధికి రూ.15 కోట్ల కేటాయించి చెరువు గట్లను వాకర్లకు అనువుగా తీర్చిదిద్దాలని కోరారు. గతంలో కొంపల్లి పంచాయితీగా ఉన్న సమయంలో ఇరిగేషన్ అధికారులకు ఈ విషయమై లేఖ రాశామన్నారు. చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లా తీర్చిదిద్దాలని కోరారు. అదే విధంగా మున్సిపల్ పరిధిలో రోడ్లు నడవడానికి వీలు లేకుండా గుంతలుగా మారాయని తెలిపారు.

రేపు డాన్‌బాస్కోలో 'క్యాంపస్ డ్రైవ్'

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ దిశ ఆధ్వర్యంలో ఈ నెల 11న మోతీనగర్–ఎర్రగడ్డ మార్గంలోని డాన్‌బాస్కో డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఐవాన్‌వాజ్, స్టీవన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగే ఈ జాబ్ డ్రైవ్‌లో పదో తరగతి నుంచి ఆపై విద్యార్హత కలిగిన వారు హాజరు కావాలని మరిన్ని వివరాలకు 94946 98219, 94940 92219.

మారియట్‌లో మిల్లెట్ ఫుడ్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరంగా ఐరాస ప్రకటించిన నేపథ్యంలో ఐటిసి హోటల్స్‌కు చెందిన మారియట్ హోటల్స్‌లో మిల్లెట్ ఆహారం ప్రత్యేక మెనూ అందిస్తున్నట్టు నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.